

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబీహా బేగం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అల్లాపూర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ రాణాప్రతాప్ నగర్‌లో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ సబీహా బేగం శుక్రవారం ప్రారంభించారు. రూ.15 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, గుత్తేదారుడిని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాణాప్రతాప్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాధవాచారి, సాంబయ్య, లింగం, శంకర్, కృష్ణ, రాజయ్య, ప్రసాద్, శేషు, ఓంప్రకాష్, టి.అనిల్, నయీం, భాగ్యలక్ష్మి, శ్రీదేవి, లావణ్య, యాదమ్మ పాల్గొన్నారు.

నేడు కేపీహెచ్‌బీలో ఎమ్మెల్యే పర్యటన

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ ధనలక్ష్మి సెంటర్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం ఉదయం 7.30 గంటలకు పర్యటించనున్నారు. ఇటీవల కేపీహెచ్‌బీ ఫేజ్-1, ఫేజ్-2 అసోసియేషన్ ఆధ్వర్యంలో తాగునీటి సమస్యపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఇక్కడ జరిగే కార్యక్రమానికి తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్న ఫేజ్-3 పరిసర ప్రాంత ప్రజలు సైతం హాజరుకావొచ్చు.



అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

కూకట్‌పల్లి బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అంజిబాబు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కేపీహెచ్‌బీ ఏడో ఫేజ్‌కు చెందిన బస్వీ అంజిబాబు ఎన్నికయ్యారు. రమ్య గ్రౌండ్‌లో యు.శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన బీసీల సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ప్రభుత్వ ధరకే ఒక్కో బీసీ కుటుంబానికి 150 గజాల స్థలం లేదా అసోసియేషన్‌కు 100 ఎకరాల స్థలం కేటాయింపు చేయాలని తీర్మానించారు. నూతన కమిటీ చైర్మన్‌గా యు.శివప్రసాద్, లీగల్ అడ్వైజర్‌గా బి.కమలాకర్‌రావు, అడ్వైజర్లుగా వీరాస్వామి, విద్యా వెంకట్, శివకుమార్, రామబ్రహ్మం, లింగయ్య, బుచ్చయ్య, అధ్యక్షుడిగా బస్వీ అంజిబాబు, ఉపాధ్యక్షులుగా కోటేశ్వర రావు, జి.కృష్ణ తదితరులు ఎన్నికయ్యారు.

గాయత్రి నగర్ 60 అడుగుల రోడ్డులో తీవ్రంగా మురుగు సమస్య

అల్లాపూర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ గాయత్రి నగర్ 60 అడుగుల రోడ్డులో కొంత కాలంగా మురుగు సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా తాత్కాలికంగా సమస్య పరిష్కారమవుతుందని, అయితే ఆ తర్వాత సమస్య తిరిగి ఉత్పన్నమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కూడా మురుగు సమస్యపై స్థానికులు వీడియో రూపంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. సానుకూలంగా స్పందించిన సిబ్బంది అక్కడకు వచ్చి శుభ్రం చేసి వెళ్లారు. అయితే కొద్ది సేపటికే మళ్లీ మురుగు రోడ్లపై పొంగడం స్థానికులను నిరాశకు గురిచేసింది. ఇకనైనా అధికారులు చొరవ తీసుకుని మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోటా 13, వంకాయ 18, బెండకాయ 32, పచ్చి మిర్చి 35, బజ్జి మిర్చి 23, కాకరకాయ 32, బీరకాయ 38, క్యాబేజీ 10, బీన్స్ 60, క్యారెట్ 18, గోబి పువ్వు 18, దొండకాయ 18, చిక్కుడుకాయ 60, గోరు చిక్కుడు 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 40, ఆలుగడ్డ 25, కీర 15, దోసకాయ 15, సొరకాయ 12, పొట్లకాయ 15, కంద 85, ఉల్లిపొరక 28, ఉల్లిగడ్డ 18, మామిడి కాయ 15-20, అరటికాయ 8-9, చామగడ్డ 35, ముల్లంగి 4-5, చిలగడ దుంప 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 60-70, మునగ కాయలు 5-6, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండు మిర్చి 80, ఉసిరి 95, కరివేపాకు 70, పర్వల్ రూ.60, పల్లికాయ 50, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు ఈ రోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఇంజనీరింగ్ అధికారుల సమాచారం

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో ఇంజనీరింగ్ పనుల కోసం అధికారులను వార్డు కార్యాలయాలు లేదా సర్కిల్ కార్యాలయాల్లో కలిసి విన్నవించవచ్చు. మీ వార్డు పరిధిలో ప్రధాన రోడ్లతో పాటు గల్లీల్లో రోడ్లు వేయలేదా? గుంతలు పడి ఉన్నాయా? రోడ్లపై నీరు నిలుస్తుందా? ఎవరైనా వ్యక్తిగత పనుల కోసం రోడ్లను తవ్వుతున్నారా?.. ఇలాంటివి ఏమి ఉన్నా ఫోన్‌లో కూడా అధికారులకు సమాచారం అందించి వాటికి పరిష్కారం ఎప్పటి లోగా చూపుతారో అడిగి తెలుసుకోవచ్చు.

కూకట్‌పల్లి సర్కిల్..

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డి.గోవర్ధన్ గౌడ్-	9154299633
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్- జి.నిఖిల్ రెడ్డి-	9701365524
ఓల్డ్‌బోయిన్‌పల్లి, జి.ఆశ, ఏఈ-	7331189482
బాలానగర్, సీహెచ్ సునీల్ కుమార్, ఏఈ-	7331170683
కూకట్‌పల్లి, కె.సాయి ప్రసన్న, ఏఈ-	7995007398
వివేకానందనగర్, ఆర్.నిఖిల్, ఏఈఈ-	9948152336
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆర్.రమేష్-	9909732030
హైదర్‌నగర్- సీలం రాజీవ్, ఏఈఈ-	7995009083
ఆల్విన్‌కాలనీ, ఎస్.శరవాణి, ఏఈ-	7337557252

మూసాపేట్ సర్కిల్..

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రమేష్-	9949994029
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బానోత్ శంకర్-	8897507965
కేపీహెచ్‌బీ, సాయిప్రసాద్, ఏఈఈ-	7995007405
బాలాజీనగర్, శ్రీనివాస్, ఏఈ-	7993360292
అల్లాపూర్, ముడావత్ రంజిత్, ఏఈ-	7337367270
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, స్రవంతి-	9701362691
మూసాపేట్, బీజం వర్షిణి, ఏఈఈ-	9381121636
ఫతేనగర్, పాడుగు రాధాకృష్ణ, ఏఈఈ-	9703896873

నిరుపయోగంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి

ఫిరోజ్‌గూడలో అవసరం లేని చోట బ్రిడ్జి ఏర్పాటు



ఫిరోజ్‌గూడ వద్ద జనాలు లేక ఖాళీగా ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి

- అవసరమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రజల విజ్ఞప్తి
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

బాలానగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లో అవసరం ఉన్న చోట కాకుండా అవసరం లేనిచోట ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించి నిధులను వృథా చేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలో ఐడీపీఎల్ చౌరస్తా, బాలానగర్ ఫిరోజ్‌గూడ ఎస్ఎస్‌కేకే సమీపంలో రెండు బ్రిడ్జిలను నిర్మించారు. ఐడీపీఎల్ చౌరస్తా వద్ద రద్దీ ఉంటుంది కాబట్టి పర్వాలేదు కానీ ఫిరోజ్‌గూడ వద్ద నిర్మించిన బ్రిడ్జిపై నుంచి రోజుకు పట్టుమని పది మంది కూడా వెళ్లడం లేదు. దీంతో ఈ బ్రిడ్జి నిరుపయోగంగా మారింది.



శోభన బస్టాపు వద్ద రోడ్డు దాటుతున్న పాదచారులు

అధికారుల అనాలోచిత నిర్ణయంతో..

రూ.3.25 కోట్లతో 21.6 మీటర్ల పొడవు, 2.40 మీ. వెడల్పుతో నిర్మించిన ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని 22 జూలై 2022లో ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌రావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డితో మేయర్ విజయలక్ష్మి కలిసి ప్రారంభించారు. ఫిరోజ్‌గూడలో ఎంఎంటీఎస్ ట్రైన్, ఎస్ఎస్‌కేకే విద్యార్థులకు, పిల్లలను దింపేందుకు వచ్చే వారి తల్లిదండ్రులకు బ్రిడ్జి ఉపయోగకరంగా ఉంటుందని, రోజుకు 5 వేల మంది వరకు దీనిని వినియోగించుకుంటారని అధికారులు అప్పట్లో వేసుకున్న లెక్కలు తారుమారయ్యాయి. రోడ్డును దాటే పాదచారులెవ్వరూ ఈ బ్రిడ్జిని వినియోగించుకోకపోవడం, ఫిరోజ్‌గూడ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు అనువుగా లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఎప్పుడూ ఖాళీగా కనిపిస్తున్న ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని చూసిన ప్రతి ఒక్కరూ అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని ప్రజలు అంటున్నారు.



బాలానగర్ ఫ్లై ఓవర్ పైనుంచి వేగంగా దూసుకొస్తున్న వాహనాలు

శోభన బస్టాపు వద్ద నిర్మిస్తే ఉపయోగకరం..

ఫిరోజ్‌గూడ వద్ద ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని బాలానగర్ శోభన బస్టాపు వద్ద నిర్మిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణం జరిగిన తర్వాత రోడ్డు దాటే క్రమంలో పలువురు ప్రమాదాలకు గురయ్యారు. కొందరు గాయాలతో బయటపడగా, కొందరు ప్రాణాలను కోల్పోయారు. ఫ్లైఓవర్ దిగాక ఎలాంటి సిగ్నల్ లేకపోవడంతో ఫ్లైఓవర్ పైనుంచి అతివేగంగా వచ్చే వాహనాలు రోడ్డు దాటుతున్న వారిని ఢీకొట్టడం లేదా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలు చాలా ఉన్నాయి. బాలానగర్‌లోని రాజు కాలనీ, వినాయకనగర్, బాలానగర్ విలేజ్, సాయినగర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు కూకట్‌పల్లి వైపు వెళ్లేందుకు బస్సు ఎక్కాలంటే శోభన బస్టాపు నుంచి సుమారు 500 నుంచి 800 మీటర్లు నడిచి చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో శోభన బస్టాపు వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించడం అవసరమని స్థానికులు పేర్కొంటున్నారు.

వినతిపత్రాలిచ్చినా స్పందన కరువు

శోభన బస్టాపు వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని అప్పటి జోనల్ కమిషనర్ మమత, ప్రస్తుత జెడ్సీ అపూర్వ చౌహాన్‌కు, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రాలు అందించినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని స్థానికులు చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తే ప్రజల ప్రాణాలపై అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరం లేని చోట ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని తొలగించి శోభన బస్టాపు వద్ద నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

డివైడర్ల పైనుంచి వెళ్తున్నారు



రోజూ వందలాది మంది బాలానగర్ నుంచి వివిధ ప్రాంతాలకు పనుల కోసం వెళ్తుంటారు. కూకట్‌పల్లి వెళ్లే బస్సు కోసం వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లలేక డివైడర్ల పైనుంచి ఎక్కి దిగుతూ బస్టాప్ వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో అప్పుడప్పుడు కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు.

\- పులి శివకుమార్‌గౌడ్, బాలానగర్

అధికారులు స్పందించాలి



ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో అధికారులు కాలయాపన చేస్తే రోడ్డు ప్రమాదాల్లో మరికొందరు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. అందుకే అధికారులు ఇప్పటికైనా స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలి.

\- మట్టి ప్రసన్న, స్థానికుడు

బ్రిడ్జి ఏర్పాటులో నిర్లక్ష్యం తగదు



ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు ఈ విషయమై అధికారులకు మొర పెట్టుకుంటున్నాయి. పాదచారులే కాదు.. స్కూల్, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు సైతం బస్సు ఎక్కాలంటే 500 మీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. అందుకే ఇప్పటికైనా జోనల్ కమిషనర్ పరిశీలించి బ్రిడ్జికి నిధులు మంజూరు చేయాలి.

\- సతీష్‌కుమార్, స్థానికుడు

వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకిస్తూ భారీ ర్యాలీ

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు బిల్లును ముస్లింలంతా వ్యతిరేకిస్తున్నారని, వెంటనే సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సేవాదళ్, కాంగ్రెస్ మైనారిటీ, ముస్లిం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం భారీ ర్యాలి నిర్వహించారు. ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట చెక్‌పోస్టు నుంచి అబ్రార్‌నగర్ ముసావీ కేఫ్ వరకు ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ హాజరై ముస్లింలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎప్పుడూ కాంగ్రెస్ వైపు ఉండే ముస్లింలు వారి ఓటును మరో పార్టీకి వేయడంతోనే కాంగ్రెస్ అధికారానికి దూరమైందన్నారు. అధికారం ఉన్నా లేకున్నా వక్ఫ్ బోర్డు బిల్లును అమలుకాకుండా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక ముస్లింలకు మద్దతుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దండుగుల యాదగిరి, మల్లికార్జున్, అంజద్, అస్లాం పాషా, ముస్తఫా, జహంగీర్, షబ్బీర్, మోయిజ్, హుస్సేన్, అక్రమ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలిలో పాల్గొని ముస్లింలకు మద్దతు తెలియజేస్తున్న సర్వే సత్యనారాయణ



దీనబంధు కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న బేరాక చర్చి సభ్యులు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచే క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కూకట్‌పల్లిలోని దీనబంధుకాలనీ, రామరావుకాలనీ, పాపారాయుడుకాలనీలో ర్యాలీ నిర్వహించారు. శనివారం రాత్రి జాగరణ ప్రార్థనలు, ఆదివారం తెల్లవారుజామున క్రీస్తు సమాధి నుంచి సజీవంగా బయటకు వస్తారని.. ఆ సందర్భాన్ని ఈస్టర్‌గా జరుపుకుంటారని క్రైస్తవులు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

హైదర్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారి పాత్ర కీలకమని సత్ సేవా సంస్కృతి ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానందనగర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆయన శుక్రవారం వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజం నిద్ర లేవకముందే నగరంలో పారిశుధ్య కార్మికులు రోడ్లను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, కార్యదర్శి రామ్మోహన్ రావు, సలహాదారు మహేష్‌గౌడ్, సభ్యులు సాయి, సుహాస్, నరేష్, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు వాటర్ బాటిల్స్ అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించవచ్చని కార్పొరేటర్ నర్సింహ యాదవ్ సూచించారు. శుక్రవారం ఉదయం డివిజన్ పరిధిలోని విఠల్ ఎన్‌క్లేవ్‌లో కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీ ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొస్తే తానూ సహకారం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కేజే శ్రీనివాస్ రెడ్డి, అజయ్ రవిచంద్రన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహ యాదవ్



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

చలివేంద్రం ప్రారంభం

బాలానగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ, మానవీయ విలువలను కలిగి ఉండాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఉదయం బాలానగర్ శోభన బస్టాప్ వద్ద వెంకటేశ్వర టెంట్ హౌస్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు కార్పొరేటర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మీనారాయణ, బండారు శివకుమార్, గొర్ల నాగేశ్వర్‌రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ మండడి సుధాకర్‌రెడ్డి, డివిజన్ నాయకులు కాజా, కృష్ణమూర్తి, శ్రీనివాస్ ముదిరాజ్, రాజేశ్‌గౌడ్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డులో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

ఫతేనగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైతే నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని గౌతమీనగర్ ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డులో రోడ్లపై, నివాసాల మధ్య మురుగు పారుతున్న విషయం తెలియడంతో శుక్రవారం ఉదయం కార్పొరేటర్ జలమండలి మేనేజర్ అనిల్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ముందుగా మ్యాన్ హోల్ సమస్యను పరిష్కరించి డ్రైనేజీ పొంగకుండా చర్యలు చేపట్టాలని మేనేజర్‌కు సూచించారు.





శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షంతో రోడ్లపై నిలిచిన నీరు

వర్షంతో వాహనదారుల ఇబ్బందులు

బాలానగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం వాహనదారులు, పాదచారులను ఇబ్బందులకు గురిచేసింది. ఉదయం నుంచి వేడి వాతావరణం ఉండగా సాయంత్రం ఒక్కసారిగా చల్లబడి మోస్తరు వర్షం కురవడంతో ఎంజాయ్ చేసిన వాహనదారులు తడవకుండా ఉండేందుకు షెడ్ల కిందకు పరుగులు తీశారు. వర్షం కారణంగా రోడ్లపై నీరు చేరి చిత్తడిగా మారింది. మోస్తరు వర్షానికే బాలానగర్ పంచవటి అపార్టుమెంటు సమీపంలో రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ సిబ్బంది అక్కడకు చేరుకుని నీటిని తొలగించారు.



పంచవటి అపార్టుమెంట్ వద్ద నిలిచిన నీటిని దారిమళ్లిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

అనారోగ్య సమస్యలతో యువకుడి ఆత్మహత్య

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఓ యువకుడు ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట్ హబీబ్‌నగర్ బోరింగ్ గల్లీలో ఉండే మహ్మద్ చోటు(25) మూడు, నాలుగు నెలల నుంచి నడుం, కుడిచేతి నొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకుంటున్నా నొప్పి తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లోని రెండవ అంతస్తులో ఫాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు మహ్మద్ మహబూబ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహ్మద్ చోటు(ఫైల్)

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



మియాపూర్ కల్వరిటెంపుల్‌లో శిలువ ప్రదర్శన నాటికలోని ఓ సన్నివేశం



నాటికలో ఏసుకు శిలువ వేస్తున్న దృశ్యం



హఫీజ్‌పేట సాయినగర్‌లో బెరాక చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



కల్వరి టెంపుల్‌లో ప్రార్థనల కోసం తరలివచ్చిన క్రైస్తవులు



కల్వరి టెంపుల్‌లో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

మియాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే వేడుకలను మియాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. మియాపూర్, మక్తామహబూబ్‌పేట, బీకే ఎన్‌క్లేవ్, మదీన గూడ, హఫీజ్‌పేటలోని చర్చిల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మియాపూర్‌లోని కల్వరి టెంపుల్‌లో తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు నిర్వహించిన ప్రార్థనల్లో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల్లో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన శిలువ దర్శనం ప్రదర్శన ఆకట్టుకుంది. ఏసుక్రీస్తును ఏ విధంగా శిలువ వేశారో కళ్లకు కట్టినట్లు చూపించారు. బ్రదర్ సతీష్‌కుమార్ భక్తులకు గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు. సమస్త మానవాళి పాపపరిహారం కోసం ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేశారని చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.



అంజయ్యనగర్‌లో నీటి కోసం ఎదురుచూస్తున్న మహిళలు

కొండాపూర్ డివిజన్‌లో తాగునీటి కష్టాలు

గచ్చిబౌలి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్, సిద్దిఖీ నగర్‌లలో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు విడిచి రోజు మంజీరా నీరు సరఫరా అవుతున్నప్పటికీ పట్టుమని 10 నిమిషాలు కూడా రావడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేంటని స్థానికంగా నల్లా నీళ్లు వదిలే లైన్ మెన్లను ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వడం లేదని మహిళలు వాపోతున్నారు. అంజయ్యనగర్, సిద్దీఖీనగర్, వడ్డెర బస్తీల్లో సమస్య తీవ్రంగా ఉందని మహిళలు చెబుతున్నారు. సామాన్యుల ఇళ్లకు రాని తాగునీరు.. పక్కనే ఉన్న హాస్టళ్లకు మాత్రం గంటల తరబడి రసఫరా అవుతుందని స్థానికులు మండిపడుతున్నారు. ఈ ప్రాంతాల్లో ఉన్న బోరు బావులు సైతం పూర్తిగా అడుగంటి పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిందిస్థాయి అధికారులు, సిబ్బంది మామూళ్లకు ఆశపడి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, హాస్టళ్ల నిర్వాహకుల వద్ద డబ్బులు తీసుకొని వారికి గంటల తరబడి నీటిని సరఫారా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మెట్రో వాటర్ మాదాపూర్ డివిజనల్ మేనేజర్ శరత్ రెడ్డిని ప్రశ్నించగా.. ఈ విషయం తమ దృష్టికి రాలేదని, ఇప్పటి వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. అధికారులు, సిబ్బందితో కలిసి అంజయ్యనగర్, సిద్దిఖీ నగర్‌లలో పర్యటించి సమస్యను తెలుసుకుంటామన్నారు. ఆరోపణలు వాస్తవమైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): తారానగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వెంకట్‌రెడ్డికాలనీ, పోచమ్మటెంపుల్ వెనుక ప్రాంతం, వెంకటాద్రి నగర్, పీజేఆర్ స్టేడియం ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హుడా కాలనీ, వాటర్ ట్యాంక్ ప్రాంతం, పార్కు వెనుక ప్రాంతం, ఎంఎంటీఎస్ స్టేషన్ రోడ్, ఆర్‌ఎస్ బ్రదర్స్ మెయిన్ రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



రాహుల్ గాంధీతో అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

రాహుల్ గాంధీని కలిసిన ఓబీసీ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

రాయదుర్గం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం జాతీయ కన్వీనర్ పంకజ్‌కుమార్ కుశ్వా, జాతీయ ప్రధాన కార్యదర్శి రీతూ, ఉపాధ్యక్షుడు పుష్పరాజ్ ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ల అమలు, విశ్వవిద్యాలయాల్లో బోధన, ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ లోపాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన సమస్యలు రాహుల్ గాంధీకి వివరించారు. ఐఐటీ, ఐఐఎం, సెంట్రల్ యూనివర్సిటీల్లో రిజర్వేషన్ల ఉల్లంఘనను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల హక్కులను పరిరక్షించేందుకు అవసరమైన రోహిత్ చట్టంను కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తక్షణమే అమలు చేయాలని వారు కోరారు. దీనికి రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారని సభ్యులు తెలిపారు.



పారిశుధ్య కార్మికులకు వాటర్ బాటిల్స్ అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

పారిశుధ్య కార్మికులకు వాటర్ బాటిళ్ల పంపిణీ

హైదర్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారి పాత్ర కీలకమని సత్ సేవా సంస్కృతి ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానందనగర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆయన శుక్రవారం వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజం నిద్ర లేవక ముందే నగరంలో పారిశుధ్య కార్మికులు రోడ్లను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, కార్యదర్శి రామ్మోహన్‌రావు, సలహాదారు మహేష్‌గౌడ్, సభ్యులు సాయి, సుహాస్, నరేష్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మనూ నాన్ టీచింగ్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ నవీద్



షేక్ నవీద్

రాయదుర్గం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జరిగిన మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (నాన్ టీచింగ్ స్టాఫ్) ఎన్నికల్లో షేక్ నవీద్ అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి గెలిచారు. జనరల్ సెక్రటరీగా షానవాజ్ అలీఖురేషి, సెక్రటరీగా సయ్యద్‌గౌస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సయ్యద్ యూసఫ్ రజ్వీ, ఉపాధ్యక్షుడిగా ధరమ్‌జిత్‌కుమార్, కోశాధికారిగా రజాక్‌షరీఫ్‌తో పాటు పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు షేక్ నవీద్ మాట్లాడుతూ.. నాన్ టీచింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబీహ బేగం

అల్లాపూర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ రాణాప్రతాప్ నగర్‌లో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ సబీహ బేగం శుక్రవారం ప్రారంభించారు. రూ.15 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, గుత్తేదారుడిని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాణాప్రతాప్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాధవాచారి, సాంబయ్య, లింగం, శంకర్, కృష్ణ, రాజయ్య, ప్రసాద్, శేషు, ఓంప్రకాష్, టి.అనిల్, నయీం, భాగ్యలక్ష్మి, శ్రీదేవి, లావణ్య, యాదమ్మ పాల్గొన్నారు.



మసీదు బండలోని కుంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, అధికారులు



రేగులకుంట చెరువు వద్ద ఎమ్మెల్యే గాంధీ, జెడ్సీ ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రీకాంత్

చెరువులకు పూర్వ వైభవం తీసుకొస్తాం

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 64 చెరువులను అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి డివిజన్ మసీదు బండలోని కింది కుంటను సందర్శించి పరిశీలించారు. కుంట పూర్తిగా దుర్గంధ భరితంగా మారడంతో గతంలో ఎలా ఉన్నదో అదే స్థాయిలో అభివృద్ధి చేయాలని అధికారును కోరారు. అందుకు కావాల్సిన ప్రణాళికలు రూపొందించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. కుంటను శుభ్రం చేయడంతో పాటు వర్షపు నీటితో నింపేందుకు ప్రణాళికలు సిద్ధ చేయాలన్నారు. పరిసర ప్రాంతాల్లోని మురుగు నీరు కుంటలోకి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న మొత్తం 64 చెరువులకు పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. తద్వారా చెరువుల్లో జీవ వైవిధ్యం పెరిగి పక్షుల వలసలు పెరుగుతాయన్నారు. చెరువుల పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు చెరువులను దత్త తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, నాయకులు గణేశ్ ముదిరాజ్, రాజుయాదవ్, శ్రీనివాస్ యాదవ్, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రేగులకుంట చెరువు పరిశీలన

మియాపూర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ దీప్తిశ్రీనగర్ కాలనీలో రేగులకుంట చెరువును, డంపింగ్ యార్డును జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. రేగుల కుంట సమస్య తీరిందని, మురికి కూపంలాంటి చెరువును స్వచ్ఛమైన మంచినీటి చెరువుగా మార్చామన్నారు. చెరువు పరిసరప్రాంత వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించినట్లు తెలిపారు. అనంతరం సమీపంలోని డంపింగ్ యార్డును వారు పరిశీలించారు. అక్కడ జరుగుతున్న చెత్త సేకరణ, నిర్వహణ తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్డుపై వేసి ప్రజలను అసౌకర్యానికి గురిచేయొద్దని సూచించారు. వ్యర్థాలు తొలగించేందుకు 1800-120-1159 నంబర్‌కు కాల్ చేస్తే సిబ్బంది ఇంటికే వచ్చి తీసుకువెళ్తారని ఆయన తెలిపారు.


రాష్ట్రంలో కాషాయ జెండా ఎగరేస్తాం

- బీజేపీ నేత రవికుమార్‌యాదవ్



కాలనీవాసులతో కలిసి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

రాయదుర్గం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో కాషాయ జెండా ఎగురవేస్తామని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ అన్నారు. గావ్ చలో-బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గోపన్‌పల్లి మంజీర డైమండ్స్ హైట్స్‌లో నిర్వహించిన స్వచ్ఛ భారత్ అభియన్ కార్యక్రమంలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. స్థానికులతో కలిసి రోడ్ల వెంబడి, కాలనీలో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరేలా చేసేందుకే బస్తీబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలు చూపడం, వారి అభివృద్ధికి సహకరించడం తమ బాధ్యత అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివసింగ్, సీనియర్ నాయకులు వసంతకుమార్ యాదవ్, రంజిత్ పూరి, హనుమంత్ నాయక్, కిషన్, ప్రభాకర్, తిరుపతి, రాజు, గోవింద, మహేష్ పాల్గొన్నారు.



దుకాణాలపై కూలిన భారీ వృక్షం



రోడ్లపై పడిన చెట్లను తొలగిస్తున్న డీఆర్ఎఫ్ బృందాలు

ఈదురుగాలులు.. భారీ వర్షం

- వర్షంతో నేలకొరిగిన వృక్షాలు
- స్తంభించిన ట్రాఫిక్, విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఇబ్బందులు పడిన ప్రజలు



వర్షంతో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిన నీరు

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో భారీ వృక్షాలు నేలకొరిగాయి. శుక్రవారం ఉదయం నుంచి అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడిన జనం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఉపశమనం పొందారు. కాగా, ఈదురు గాలులతో పలు ప్రాంతాల్లో రోడ్లపై చెట్లు కూలాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. ఎంఐజీకాలనీలో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇళ్లపై చెట్లు పడడంతో పాటు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు నేలకొరగడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. విద్యుత్ పునరుద్ధరణకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. ఎంఐజీకాలనీ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది, డీఆర్‌ఎఫ్ బృందాలు దుకాణాలు, రహదారులపై కూలిన చెట్లను తొలగించారు.



మోహన్‌రావును సన్మానిస్తున్న వంశీరెడ్డి తదితరులు

గరికపాటి మోహన్‌రావును కలిసిన బీజేపీ నాయకులు

హైదర్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎన్.వంశీరెడ్డి శుక్రవారం మాజీ రాజ్యసభ సభ్యుడు, జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కల్యాణి దుర్గాప్రసాద్, రాజు, దీపక్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొని ముస్లింలకు మద్దతు తెలియజేస్తున్న సర్వే సత్యనారాయణ

వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకిస్తూ భారీ ర్యాలీ

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు బిల్లును ముస్లింలంతా వ్యతిరేకిస్తున్నారని, వెంటనే సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సేవాదళ్, కాంగ్రెస్ మైనారిటీ, ముస్లిం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం భారీ ర్యాలి నిర్వహించారు. ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట చెక్‌పోస్టు నుంచి అబ్రార్‌నగర్ ముసావీ కేఫ్ వరకు ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ హాజరై ముస్లింలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎప్పుడూ కాంగ్రెస్ వైపు ఉండే ముస్లింలు వారి ఓటును మరో పార్టీకి వేయడంతోనే కాంగ్రెస్ అధికారానికి దూరమైందన్నారు. అధికారం ఉన్నా లేకున్నా వక్ఫ్ బోర్డు బిల్లును అమలు కాకుండా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక ముస్లింలకు మద్దతుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దండుగుల యాదగిరి, మల్లికార్జున్, అంజద్, అస్లామ్ పాషా, ముస్తఫా, జహంగీర్, షబ్బీర్, మోయిజ్, హుస్సేన్, అక్రమ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహ యాదవ్

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించవచ్చని కార్పొరేటర్ నర్సింహ యాదవ్ సూచించారు. శుక్రవారం ఉదయం డివిజన్ పరిధిలోని విఠల్ ఎన్‌క్లేవ్‌లో కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీ ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొస్తే తానూ సహకారం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కేజే శ్రీనివాస్ రెడ్డి, అజయ్ రవిచంద్రన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాత బస్సులతో అవస్థలు

- ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపుతున్న ఆర్టీసీ
- ఇంకా ఉమ్మడి రాష్ట్రంలోనివే దిక్కు
- మార్గం మధ్యలో ఆగిపోవడంతో ప్రయాణికుల ఇక్కట్లు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రోజు రోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం ప్రజా రవాణా సౌకర్యాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సర్వీసులను పెంచకపోయినా పర్వాలేదు కానీ ఉన్న బస్సులనైనా ఫిట్‌గా అందుబాటులో పెట్టకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడకు గ్రేటర్‌లోని అన్ని ఆర్టీసీ డిపోల నుంచి సర్వీసులు నడుస్తుంటాయి. ఇక్కడ పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో కార్మికులు అధికంగా బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. అయితే ఫిట్‌నెస్ లేని బస్సులను నడపడం వల్ల కొందరు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని పాత బస్సులనే అందుబాటులో ఉంచుతున్నారు. శుక్రవారం ముషీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ 11 జెడ్ 6923) కాచిగూడ నుంచి గండిమైసమ్మకు ప్రయాణికులతో వస్తోంది. గాజులరామారం సర్కిల్ షాపూర్‌నగర్‌లోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీ వద్దకు రాగానే ఒక్కసారిగా బస్సు నిలిచిపోయింది. బస్సు ఒక్కసారిగా కుదుపునకు గురికావడంతో ప్రయాణికులు ప్రమాదం జరిగిందేమోనని భయాందోళనకు గురయ్యారు. ఏమీ కాలేదని... బస్సు ఇంజిన్ ఫెయిలైందని డ్రైవర్ చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. దీంతో వెనకాల నుంచి వచ్చే వాహనాలు కాసేపు ట్రాఫిక్‌తో సతమతమయ్యారు. ట్రాఫిక్ పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అందులోని వారిని కండక్టర్ మరో బస్సులో ఎక్కించి గమ్య స్థానాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. బస్సు నిలిచిపోవడం వల్ల సమయానికి వెళ్లలేక నిత్యం పాత బస్సులతో ఇబ్బందులు ఎదురవుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. కొత్త బస్సులను అందుబాటులోకి తేవాలని ప్రయాణికులు టీజీఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరుతున్నారు.


శుక్రవారం షాపూర్‌నగర్‌లోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీ వద్ద ఇంజిన్ ఫెయిలై నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు


లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీని అందజేస్తున్న కార్పొరేటర్

పేదలకు సంజీవని సీఎం సహాయ నిధి

● జగద్గిరిగుట్ట కార్పొరేటర్ కొలుకుల జగన్

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవనిగా ఉపయోగపడుతుందని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. జగద్గిరిగుట్టకు చెందిన ఫర్హానాబేగం, గాజులరామారానికి చెందిన ఆకుల ధనుష్‌గౌడ్‌లు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. వారి ఆర్థిక పరిస్థితి సరిగా లేదని స్థానికుల ద్వారా తెలుసుకున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఇరువురికి రూ.1.5 లక్షల చొప్పున మంజూరు చేయించారు. సీఎంఆర్‌ఎఫ్ మంజూరు ఎల్‌ఓసీ పత్రాలను శుక్రవారం బాధితులకు కార్పొరేటర్ జగన్, గాజులరామారం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు విజయరాంరెడ్డి, జగద్గిరిగుట్ట డివిజన్ పార్టీ అధ్యక్షులు రుద్ర అశోక్‌లు చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బౌరంపేట పీఏసీఎస్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, జగద్గిరిగుట్ట శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం మాజీ చైర్మన్ వేణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీఎన్‌క్లేవ్‌లో జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న భరత్ సింహారెడ్డి

'త్వరలోనే కాలనీల సమస్యలను పరిష్కరిస్తా'

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జీడిమెట్ల డివిజన్‌లోని ప్రాగా టూల్స్, శ్రీఎన్ క్లేవ్‌ల్లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రాగాటూల్స్ కాలనీలో తాగునీరు, రోడ్లు, శ్రీఎన్‌క్లేవ్‌లో కొత్తగా చేపడుతున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను భరత్ సింహారెడ్డి దృష్టికి తీసుకురాగా, అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాకేష్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, పెద్దిరెడ్డి, నవోదయ రెడ్డి, గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌రావు, విజయ్, కిరణ్, రాంబాబు, సుదర్శన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

జీతాలు రాలేదని మున్సిపల్ కార్మికుల నిరసన

నిజాంపేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రెక్కాడితేగాని డొక్కాడని కార్మికులకు ప్రతీ నెలా జీతం ఆలస్యంగా వస్తే వారు ఎలా బతుకుతారని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ ప్రశ్నించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసే కార్మికులకు జీతం ఆలస్యంగా రావడాన్ని నిరసిస్తూ మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులతో కలిసి శుక్రవారం ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ సిబ్బందికి, ఉద్యోగులకు 7వ తేదీన రావాల్సిన జీతాలు ఇప్పటి వరకు రాకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి నేరుగా బ్యాంక్‌కు వెళ్లాల్సిన కార్మికుల జీతాలు రాష్ట్ర ప్రభుత్వ కోశాధికారి వద్దకు వెళ్లి రావడంతో ఆలస్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గయ్య, యాదయ్య, నర్సమ్మ, సత్తెమ్మ, యాదమ్మ, పుష్పమ్మ, కృష్ణ, రాజు,నాగయ్య, జీతయ్య పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన పలు బస్తీల ప్రజలు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

దుండిగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నిరతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆయను శంభీపూర్‌లోని కార్యాలయంలో పలువురు కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ ఆయా శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు.


భగత్‌సింగ్‌నగర్‌లో మ్యాన్‌హోల్ నుంచి లీకవుతున్న మురుగు

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్‌లో నిత్యం సమస్య వస్తోందని స్థానికులు చెప్తున్నారు. బస్తీలోని మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ ఎదురుగా ఉన్న మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు లీకవుతూ రోడ్డుపై పారుతుండటంతో పెద్ద గుంత ఏర్పడిందని, తీవ్ర దుర్వాసన వస్తుందని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. నిత్యం ఇక్కడ సమస్య ఉత్పన్నమవుతున్నా అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.



మురుగు సమస్యకు చెక్

'రోడ్డుపై మురుగు పరుగు' అని శుక్ర వారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. జీడిమెట్ల డివిజన్ వెన్నెల గడ్డలోని అపోలా ఫార్మసీ మూల మలపు వద్ద గల మ్యాన్‌హోల్ నుంచి కిలో మీటర్ల మేర మురుగు నీరు పొంగి రాఘ వేంద్ర కాలనీ వరకు రహదారిపై పారు తోంది. దీంతో అధికారులు గల్పర్‌తో మ్యాన్ హోల్‌ను శుభ్రం చేయించి, అందులో చెత్తాచెదారం తొలగించారు.

- (ఆంధ్రజ్యోతి,పేట్‌బషీరాబాద్)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పైప్‌లైన్ పనులతో నీళ్లు రాక అగచాట్లు

● త్వరగా పూర్తి చేయాలని ఆదర్శనగర్ వాసుల విజ్ఞప్తి


ఆదర్శనగర్ చౌరస్తాలో జరుగుతున్న పైప్‌లైన్ పనులు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఆదర్శనగర్ ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో జరుగుతున్న మెట్రోవాటర్ వర్క్స్ పనులను తొందరగా పూర్తి చేయాలని ఆదర్శనగర్ వాసులు అధికారులను కోరుతున్నారు. 50 ఏళ్ల క్రింతం ఉన్న మంజీరా పైప్‌లైన్ మార్చి 6 వందల ఎంఎం డయా పైప్‌లైన్ బాలానగర్‌లోని పరిశ్రమల కోసం ఎంఎస్ జీవ్‌నకే వాటర్ ఎన్విరో ప్రైవేట్ లిమిటెడ్ వారు వేస్తున్నారని, దీంతో కాలనీలకు నీటి సరఫరా జరిగే పైప్‌లు పగిలి పోయి నీళ్లు సరిగా రావడం లేదని మాజీ వైస్ చైర్మన్ జయరామ్, రవీందర్‌గుప్తా , శ్రీకాంత్‌రెడ్డి, రామకృష్ణలు ఆరోపించారు. పురాతన పైప్‌లైన్లు ఉన్న ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్లతో ఇటీవల పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్ మొత్తం పాడైందని, ఆదర్శనగర్ చౌరస్తాలో జంక్షన్ ఏర్పాటు చేసేందుకు మూడుసార్లు తవ్వి వేయడంతో సౌభాగ్యనగర్, ఇందిరానగర్, గాంధీనగర్, గుడేన్ మెట్టు, సుమిత్రానగర్ కాలనీలకు నీటి సరఫరా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఈ జంక్షన్ పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

జర్నలిస్టు కాలనీ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలం

● కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ లాలయ్య

నిజాంపేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట కార్పొరేషన్ 30వ డివిజన్ జర్నలిస్టు కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని, సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు విద్యుత్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని జర్నలిస్టు కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య అన్నారు. నెల రోజులుగా కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని, దీని ద్వారా స్థానిక ప్రజలు రాత్రి సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈవిషయమై మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్ శాఖల అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోవడంలేదని లాలయ్య ఆరోపించారు. గత కొన్ని రోజులుగా రాత్రిపూట విషపురుగులు రోడ్లపై తిరుగుతూ అటుగా వెళ్లే పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారని, దీనికి తోడు వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస్యకు రాత్రి సమయంలో వీధిలోకి రావాలంటేనే కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారని, కనీసం ఇప్పటికైనా ఉన్నతాధికారు లు స్పందించి ఈ సమస్యపై స్పందించాలని లాల య్య డిమాండ్ చేశారు.

బిల్లులు చెల్లిస్తున్నా తప్పని నీటి కొనుగోలు

● లోప్రెషర్ వల్ల తాగునీరు అందక పలువురి ఆవేదన

షాపూర్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జలమండలి అధికారుల కారణంగా లోప్రెషర్‌తో నీటి సరఫరా అవుతుండటంతో పలు కాలనీల ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారు. వేసవికాలంలో తాగునీరు వినియోగం ఎక్కువ ఉంటుంది. షాపూర్‌నగర్ జలమండలి పరిధిలోని పలుకాలనీలకు తాగునీరు సరిగా అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంజయ్‌గాంధీనగర్, కళావతినగర్, న్యూషాపూర్‌నగ ర్, మార్కండేయనగర్, హెచ్‌ఏఎల్‌కాలనీ, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. దీంతో కొందరు డబ్బులు వెచ్చించి ట్యాం కర్ల నీటిని కొనుగోలు చేస్తున్నారు.


హెచ్‌ఏఎల్‌కాలనీలో నల్లానీరు రాక ట్యాంకర్‌తో నీటిని పోయించుకొంటున్న దృశ్యం

తాము ప్రతినెలా క్రమం తప్పకుండా నల్లా బిల్లులు చెల్లిస్తున్నా నీరురాని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరికీ తాగునీరు అందేలా జలమండలి అధికారులు చూడాలని పలువురు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతు కారణంగా శనివారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గా ఎస్టేట్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు, గాయత్రినగర్‌లో ఉదయం 9.30 నుంచి 10గంటల వరకు, సెయింట్ ఆన్స్ స్కూల్ పరిధిలో 10 నుంచి 10.30ల వరకు , వైష్ణవి ఎన్‌క్లేవ్ మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో...

కొంపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని దూలపల్లిలో మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు, ప్రశాంత్‌నగర్‌లో ఉదయం 9 గంటల నుంచి 9.30 గంటల వరకు, జయభేరిలో మధ్యాహ్నం 3 నుంచి 3.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

గాజులరామారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవ జరగడంతో ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూరారం పోలీసుల కథనం ప్రకారం.. బేగంపేటకు చెందిన అజయ్ (34) శృతి అనే మహిళను 2015లో వివాహం చేసుకున్నాడు. ఆరు నెలలు క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో వేర్వేరుగా ఉంటున్నారు. శృతి సూరారం కృషి కాలనీలో నివాసం ఉంటోంది. వారం రోజుల క్రితం అజయ్ సూరారం శివాలయం నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. కాగా, ఈ నెల 16న అతను ఉంటున్న గది నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని రాజు 100కు డయల్ చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అజయ్ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మద్యానికి బానిసై అజయ్ ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారని పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తూ చెరువులో పడి వృద్ధురాలి మృతి

దుండిగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తూ చెరువులో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీసు స్టేషన్ పరిధిలోని డీపోచంపల్లి గ్రామంలోని చింతకుంట చెరువులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. డీపోచంపల్లికి చెందిన నాచారం సత్తమ్మ(65) గ్రామంలో ఉన్న తన కొడుకు ఇంటి నుంచి చింతకుంట చెరువుకు అటువైపు ఉన్న కుమార్తె ఇంటికి శుక్రవారం ఉదయం 10 గంటలకు చెరువు కట్టమీదుగా నడుచుకుంటూ బయలుదేరింది. మార్గంమధ్యలో ప్రమాదవశాత్తూ కాలు జారి చెరువు నీటిలో పడి మృతి చెందింది. ఈ ఘటనపై దుండిగల్ పోలీసులను సంప్రదించగా సత్తమ్మ చెరువులో పడి మృతి చెందిన విషయం విదితమేనని, ఆమె కుమార్తెలు, కుమారులు ఈ ఘటనపై తమకు ఎలాంటి అనుమానం లేదని తమకు రాసి ఇచ్చారని సీఐ తెలిపారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

● విల్లాలోకి చొరబడి వాచ్‌మెన్‌పై దాడి: కేసు నమోదు

దుండిగల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఉన్న ఐదుగురు యువకులు శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో వీరంగం సృష్టించారు. బహదూర్‌పల్లిలోని అయోధ్య విల్లాలో చొరబడి వాచ్‌మెన్‌ను కొట్టి అడ్డుకోబోయిన స్థానిక మహిళలను దుర్భాషలాడి పరారయ్యారు. ఈ విషయంపై వాచ్‌మెన్ భార్య ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన గుణేష్, అజయ్, తిరుమలేష్‌తో పాటు మరో ఇద్దరు యువకులు శుక్రవారం తెల్లవారు జామున అయోధ్య విల్లాల్లోకి కారుతో గేటును ఢీకొని లోపలికి వచ్చి పార్కింగ్ చేసి ఉన్న కారును ఢీకొట్టారు. వాచ్‌మెన్ దిలీప్ తన ఫోన్ కెమెరాలో ఈ ఘటనను వీడియో తీస్తుండగా, మద్యం మత్తులో ఉన్న యువకులు గమనించి అతడిపై మూకుమ్మడిగా దాడి చేశారు. స్థానిక మహిళలు అడ్డుకోబోగా వారితో పాటు అక్కడే ఉన్న వాచ్‌మెన్ భార్యను కూడా దుర్భాషలాడుతూ కారులో పరారయ్యారు. వెంటనే కాలనీవాసుల ఈ ఘటనపై దుండిగల్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సతీష్ పర్యవేక్షణలో పోలీసు సీసీ కెమెరాల ద్వారా ఆకతాయిలను గుర్తించి వివరాలు తీసుకున్నారు. వాచ్‌మెన్ భార్య పూలన్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్య సమస్యతో యువకుడి ఆత్మహత్య


మహ్మద్ చోటు(ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఓ యువకుడు సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట్ హబీబ్‌నగర్ బోరింగ్ గల్లీలో ఉండే మహ్మద్ చోటు(25) మూడు, నాలుగు నెలల నుంచి నడుం, కుడిచేతి నొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకుంటున్నా నొప్పి తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లోని రెండవ అంతస్తులో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు మహ్మద్ మహబూబ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్‌బోర్డును పరిరక్షించాలని ముస్లింల నిరసన

షాపూర్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డును పరిరక్షించాలని శుక్రవారం కుత్బుల్లాపూర్‌కు చెందిన మైనార్టీ నాయకులు, ప్రజలు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. నియోజకవర్గంలోని రోడామిస్త్రీనగర్, సూరారం, చింతల్, జగద్గిరిగుట్ట తదితర ప్రాంతాల నుంచి ర్యాలీగా ముస్లింలు వేలాదిగా షాపూర్‌నగర్ గాజులరామారం చౌరస్తాకు తరలివచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. షాపూర్‌నగర్ రోడ్డు ముస్లింలతో కిక్కిరిసి పోవడంతో జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలకు అన్యాయం చేయాలని చూస్తున్నదని, వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లిం మైనారిటీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, తక్షణమే సవరణ చట్టంతో పాటు నూతన వక్ఫ్‌బోర్డును రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు.



షాపూర్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న ముస్లిం నాయకులు


చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు


ఏసుక్రీస్తు నాటికలో శిలువపై కరుణామయుడు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

షాపూర్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఈస్టర్ పర్వదినానికి రెండు రోజుల ముందు వచ్చే గుడ్‌ఫ్రైడేను శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్‌నగర్, సూరారం, గండిమైసమ్మ, బాచుపల్లి, కొంపల్లి, చింతల్, జగద్గిరిగుట్ట, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే క్రీస్తును శిలువ వేసిన రోజుకాబట్టి క్రైస్తవులు ఉపవాసం ఉండి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. గుడ్‌ఫ్రైడే సందేశం ఇచ్చిన పాస్టర్లు ఏసుకు పిలాతుచే తీర్పు, శిలువ మోయడం, సైనికులు శిలువ వేయడం, శిలువపై ఏసు పలికిన ఏడు మాటలను విపులంగా వివరించారు. చర్చిల్లో ఏసుక్రీస్తు నాటికను ప్రదర్శించారు. కాగా, శిలువ వేయబడిన క్రీస్తు శనివారం సమాధి చేయబడి, మూడవరోజు ఆదివారం సమాధిని జయంచి పునరుద్ధారుడై లేచారని క్రైస్తవుల నమ్మకం. ఆ రోజును ఈస్టర్ పర్వదినంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు జరుపుకొంటారు.


కుత్బుల్లాపూర్‌లో వర్షం కురుస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్‌లో భారీ వర్షం

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజూ 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు, ఆకులు కూడా ఊగకుండా ఉక్కపోతతో ఇబ్బందుకు గురైన ప్రజలకు శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా వరుణుడు కరుణించడంతో వేడి నుంచి ఉపశమనం పొందారు. సాయంత్రం 5.30 గంటలకు మొదలైన వర్షం 6.45 గంటల వరకు ఈదురు గాలులతో పాటు భారీగా కురువడంతో ప్రజలు ఉక్కపోత నుంచి విముక్తి పొందినట్లయింది. అయితే ఉద్యోగులు, ప్రయాణికులు సాయంత్రం కావడంతో ఇళ్లకు చేరుకోవడానికి కాస్త ఇబ్బందులకు గురయ్యారు.